క్లుప్తంగా

నేడు ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కం ట్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నందీశ్వరునికి, శివునికి ఏకకాలంలో పూజలు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు వేయండి



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం : వచ్చే నెల జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ నాడు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ భారతి తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం గ్రామస్తులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ భారతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చాలా ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుందని, ప్రజలంతా ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరూ ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఓటును అమ్ముకోకుండా సరైన నాయకుడినే ప్రజలు ఎన్నుకోవాలని ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తమిళనాడు సరిహద్దుల్లో వాహనాలు తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, ఏఎస్ఐ మురుగేష్ పాల్గొన్నారు.

23న త్రిమూర్తుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతాప్‌స్వామి

వెదురుకుప్పం: మండలంలోని ముశాలం సమీపంలో ఉన్న శ్రీ మరకతవల్లీ సమేత స్వయంభు సిద్దేశ్వర క్షేత్రంలో మంగళవారం త్రిమూర్తుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి తెలిపారు. శనివారం ఆలయాన్ని సందర్శించి కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్ స్వామి మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో సకాలంలో వర్షాలు కురిసి పాడి ముర్వాలనే సంకల్పంతో కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అవసరమైన వసతులు సమకూర్చుతున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి బాలనాగమ్మ నాటక ప్రదర్శన తిరుపతి కళాకారులచే నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన



పరికరాల పనితీరును వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు అగ్నిమాపక కేంద్రంలో అందుబాటులో ఉన్న పరికరాలను ప్రదర్శనగా ఉంచారు. వాటి పనితీరును విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులకు వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్ రాజు, ప్రవీణ్‌కుమార్, విజయ, మోహన్, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వర రావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం ప్రారంభం



ఆలయంలో కుంభాభిషేకం పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో శనివారం సాయంత్రం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కుంభాభిషేకంలో తొలిరోజు శనివారం సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, వాస్తుపూజ, వాస్తుశాంతి, అంకురార్పణం, ప్రవేశ బలి నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గోపూజ, రక్షాబంధనం, కలశ స్థాపన, మూలమంత్ర హోమం, మంత్ర పుష్పం జరగనుంది. కుంభాభిషేక ఏర్పాట్లను గోవర్ధనగిరి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

జనం లోనే.. తోనే..

- మంత్రి రోజా కుటుంబమంతా ప్రజాసేవలోనే ..
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న కుటుంబ సభ్యులు
- వాడవాడలా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, కుమారస్వామిరెడ్డి ప్రచారం
- ప్రజలతో మమేకమవుతున్న భర్త సెల్వమణి

నగరి : జనంలోనే ఉంటూ జనంతో మమేకమవుతూ ఆర్‌కే కుటుంబం ప్రజాసేవలో నిమగ్నమైంది. ఒక మహిళగా తాను ఎంచుకున్న రంగం ఏదైనా.. అందులో సక్సెస్ అవుతూ ముందడుగు వేస్తున్న మంత్రి ఆర్కే రోజాకు తాము సైతం అంటూ కుటుంబసభ్యులు అండగా నిలుస్తున్నారు. మంత్రితో పాటు తాము కూడా ప్రజలకు అండగా ఉంటాం అంటూ నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇస్తూ ప్రజల మధ్య ఉంటున్నారు. తలోదిక్కున ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమాన్ని వివరిస్తున్నారు. మంత్రి రోజా భర్త ఆర్కే సెల్వమణి, సోదరులు కుమారస్వామి రెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, నిత్యం ప్రజల్లో గడుపుతున్నారు. ఆర్‌కే సెల్వమణి అయితే భార్యకు సహకారం అందిస్తూ ఆమె విజయాన్ని తన విజయంగా భావించి ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే చెల్లెలి విజయం కోసం అన్నలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎలాంటి భేషజాలు లేకుండా తమ చెల్లెలు ఆర్‌కే రోజా ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నారు. అందరి సహకారంతో మంత్రి రోజాను విజయం వైపు నడిపిస్తున్నారు. మరోవైపు ఆ బలాన్ని తగ్గించేందుకు ప్రతిపక్ష టీడీపీ కుట్రలు పన్నుతోంది. అసత్యపు ఆరోపణలను వారిపై గుప్పిస్తూ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోంది. నలుగురు నాలుగువైపులా ప్రజలకు అందుబాటులో ఉంటే దానికి వక్రభాష్యం అల్లి బూతద్దంలో చూపుతోంది. అయితే వీటిని లెక్కచేయని వారు ప్రజలకు నిజానిజాలను వివరిస్తూ ముందుకెళ్తున్నారు.

అడుగడుగునా స్వాగతం..

పుత్తూరు మున్సిపాలిటీ ఇరవై రెండవ వార్డు పరిధిలో ఆరేటమ్మ కాలనీ, ఎస్‌బీఐ కాలనీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి ఆర్‌కే రోజా పాల్గొన్నారు. మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి ఆమెకు స్వాగతం పలికారు. ఆమెతో సెల్ఫీలు దిగారు. వారికి మంత్రి తాను చేసిన అభివృద్ధికి సంబంధిత కరపత్రాలు అందించి రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.



ఏకాంబరకుప్పంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి భర్త సెల్వమణి



పుత్తూరు పట్టణంలో ప్రచారం చేస్తున్న మంత్రి సోదరుడు కుమారస్వామి రెడ్డి



కేవీపురంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రాన్ని, అందిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి మున్సిపాలిటీ ఏకాంబరకుప్పంలో..

నగరి మున్సిపాలిటీ ఏకాంబరకుప్పంలో మంత్రి ఆర్కేరోజా భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లిన ఆయన ఐదేళ్లలో ప్రభుత్వ సహకారంతో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచి ఓటు అడుగుతుందో ఆ ప్రభుత్వానికే ఓటెయ్యాలన్నారు. ఉత్తుత్తి హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే పార్టీలకు ఓటు వేయవద్దని కోరుతున్నారు. అభివృద్ధి చేశాం.. కనుకే ఫ్యాను గుర్తుకు ఓటేసి తన భార్యను గెలిపించాలన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు బీడీ భాస్కర్, భూపాలన్, బాబు, కోఆప్షన్ సభ్యులు ఆనంద్, ఎల్లప్పరెడ్డి, స్థానిక నాయకులు జయరామిరెడ్డి, అరుణ్‌కుమార్, తులసి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మంత్రితో సెల్ఫీ తీసుకుంటున్న మహిళ

పుత్తూరు పట్టణంలో..

పుత్తూరు పట్టణంలో మంత్రి సోదరుడు కుమారస్వామి రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఎంత మేలు జరిగిందో వివరిస్తూ కరపత్రాలను అందిస్తున్నారు. ఫ్యాను గుర్తుపై ఓటువేసి తన సోదరిని మంచి మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. గెలిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ప్రజలకు వివరిస్తున్నారు.

విజయపురం మండలం కేవీపురంలో..

విజయపురం మండలం కేవీపురంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో తన సోదరిని గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే అధికారం

- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరు
- ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని, ఎంపీగా రెడ్డెప్పను భారీ మెజారిటీతో గెలిపించుకుందాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, దయాసాగరరెడ్డి



తన సోదరి కృపాలక్ష్మిని గెలిపించాలని కోరుతున్న కళత్తూరు ఇందిరా ప్రియదర్శిని



ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గజమాలతో సన్మానిస్తూ వినాయకుడి చిత్రపటాన్ని అందిస్తున్న నేతలు

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్ని కలిసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే అధికారమని తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని డెప్యూటీ సీఎం నారాయణస్వామి చెప్పారు. శనివారం పెనుమూరు మండలం కలవగుంట, నంజరపల్లె పంచాయతీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు మహాసముద్రం దయాసాగరరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కలవగుంట లక్ష్మి నరసింహస్వామి, రామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేపట్టారు. అనంతరం గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పతో కలిసి ప్రచారం ప్రారంభించారు. ప్రతి గ్రామంలో మహిళలు అభ్యర్థులకు కర్పూర హారతులు ఇచ్చారు. యువత బాణసంచా పేల్చుతూ గజమాలలతో సన్మానాలు చేపట్టారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చంపేందుకు గట్టి ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. దేవుడి కృపతో జగనన్న ప్రమాదం నుంచి బయట పడ్డారని చెప్పారు. ఎన్ని పార్టీలు ఒక్కటైనా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభంజనాన్ని అడ్డుకోలేరన్నారు. రాష్ట్రంలో 160 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలు గెలిచి జగనన్న తిరిగి సింహాసనంపై కూర్చోబోతున్నాడని తెలిపారు. ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలు గతంలో డెప్యూటీ సీఎం నారాయణస్వామికి, తనకు 45 వేల కంటే భారీ మెజారిటీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కళత్తూరు కృపాలక్ష్మిని, ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలు కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, మిథున్‌రెడ్డి, తన తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి నమ్మకాన్ని కాపాడుతానని తెలిపారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకుడు మహాసముద్రం దయాసాగర రెడ్డి, జీడీనెల్లూరు నియోజకవర్గ పరిశీలకుడు ఆనందరెడ్డి మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. ముస్లింలు అధికంగా ఉన్న కలవగుంట పంచాయతీని డెప్యూటీ సీఎం నారాయణస్వామి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.వి జయకుమార్, ఎంపీపీ హేమలతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు దొరస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు యశోదారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కమలాకరరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.మోహన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఆమీన్, వైస్ ఎంపీపీలు కోదండన్, జ్యోతి, నాయకులు సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల యువత అధ్యక్షుడు కె.లోకేష్ రెడ్డి, బాలాజి రెడ్డి, పూర్ణ చంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, దేవరాజులు రెడ్డి, గంధం ముని,గోపాల్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, మధర్, గంగుపల్లె రవి, రామచంద్ర బూపతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



మాడవీధుల్లో దర్శమిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.

కోలాహలం.. రథోత్సవం

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి ఉత్సవర్లు రథోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఆలయానికి రథం లేనందున సర్వభూపాల వాహనంలో ఉత్సవర్లకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం నఉత్సవమూర్తులు సుందరంగా అలంకరించుకుని సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ హారతులను అందుకున్నారు. ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు రమేష్ గురుకళ్, గౌతం గురుకళ్ పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం మరగదవల్లీ, అగస్తీశ్వరస్వామికి ఆర్జిత కల్యాణం, రాత్రి అశ్వవాహనంలో ఉత్సవర్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆర్జిత కల్యాణోత్సవానికి రూ.500 చెల్లించి దంపతులు పాల్గొని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.



రథోత్సవంలో అగస్వీశ్వరస్వామి

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురం : రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని మండల కన్వీనర్ మణి కోరారు. మండలంలోని శ్రీరంగరాజపురం, క్షీరసముద్రం పంచాయతీల్లో సర్పంచులు హరిత, చిరంజీవి, ఐశ్వర్య, ఎంపీటీసీ సభ్యులు శివయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంరద్భంగా గ్రామాల్లో వారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు పాలనలో జరిగిన అవినీతిని నేడు జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు మధ్య జరగబోయే ఎన్నికల్లో రణక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గంగాధర నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గెలిపించి జగనన్నను సీఎం చేయడానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కుప్పయ్య, నాయకులు జనార్ధన్, రాజా, శేఖర్, చంద్రశేఖర్, కరుణాకర్, రఘు, శ్రీధర్, రిషి, డిసెంబర్‌శెట్టి, బాలాజీ, బాబు, ప్రసాద్‌రెడ్డి, శీనయ్య, మార్కొండయ్య, మహేష్, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం



పుత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

- సంక్షేమం కావాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించండి
- చంద్రబాబు అవకాశవాద రాజకీయాలు ఇక చెల్లవు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు: సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఎన్నుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ 22వ వార్డులోని ఆరేటమ్మ కాలనీ, కేఎన్‌రోడ్డు, ఎస్బీ కాలనీ, పద్మావతి నగర్‌లో మంత్రి రోజా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రోజాకు మహిళలు కర్పూర హారతులు ఇస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కలిగిన కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు అవకాశవాద రాజకీయాలు ఇక చెల్లవని తేల్చి చెప్పారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని ఆరోపించారు. జగనన్న తన ఐదేళ్ల పాలనలోనే అద్భుతాలు చేశారని చెప్పారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలని, అందుకు నేను సిద్ధం మీరు సిద్ధమా అన్ని ప్రశ్నించారు. పలువురు మహిళలు మేమూ సిద్ధం అంటూ ముక్త కంఠంతో సమాధానం ఇచ్చారు.



మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి రోజా

హామీల అమలు ఓ చరిత్ర

గతంలో ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న గత ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లక్షల్లో లబ్ధి చేకూరుతోందని చెప్పారు. ఇలాంటి సీఎం మనకు రావడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు. నగరి నుంచి తనను ముచ్చటగా మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, పార్టీ నాయకులు ఏకాంబరం, షకీలా, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశన్‌రెడ్డి, ఈశ్వరయ్యయాదవ్, ప్రసాద్, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు



నగరి : నామినేషన్ కార్యక్రమానికి తండోపతండాలుగా విచ్చేసి తనను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మంత్రి ఆర్‌కే రోజా కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మండుటెండను సైతం లెక్క చేయక ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ తాను నాయకులు, కార్యకర్తలుగా భావించడం లేదని అందరూ తన కుటుంబ సభ్యులే అన్నారు. వారందరికీ ఊపిరి ఉన్నంతవరకు రుణపడి ఉంటానన్నారు. తనకు సీటు రాదంటూ పలువురు దుష్ప్రచారం చేశారని, అయితే జగనన్న ఆశీర్వదించి బీ-ఫారం ఇచ్చి పంపించారన్నారు. తనకు భగవంతుడి ఆశీస్సులు, జగనన్న ఆశీర్వాదం, నియోజకవర్గ ప్రజల అభిమానం మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇవే మూడోసారి విజయాన్ని తప్పక అందిస్తాయన్నారు.